శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆయా మండలాల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాసులు అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించి తహసీల్దార్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్‌లో మౌలిక సదుపాయాలు నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి ఉన్నాయా అనే విషయాలను నిశితంగా పరిశీలించాలన్నారు. అదేవిధంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో గత ఎన్నికల్లో ఏమైనా రీ పోలింగ్ జరిగిందా.. 10 శాతం కంటే తక్కువ పోలింగ్ జరిగిందా అనే విషయాలను కూడా వారు సెక్టోరియల్ అధికారుల ద్వారా సమాచారాన్ని తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా క్లైమ్‌ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని సకాలంలో పరిష్కరించేలా ఆయా మండలాల తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు జె. విజయశ్రీ, సీహెచ్ శ్రీనివాసరావు, శైలేంద్ర కుమార్, జి. రమేష్‌కుమార్, టి. సురేష్‌బాబు, బుచ్చి కమిషనర్ రమణబాబు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, తదితరులు ఉన్నారు.

## గుమ్మలదిబ్బలో పశు సంవర్ధక శాఖ అధికారుల తనిఖీలు



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో గతంలో కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి రావడం, ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి 400 పైగా కోళ్లను తీసుకువచ్చి ఖననం చేయడం విధితమే. ఈ మేరకు శనివారం పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు ఆదేశాల మేరకు కోవూరు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య సూచనలతో పశు సంవర్ధక శాఖ అధికారుల బృందం శనివారం గుమ్మలదిబ్బ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కోళ్ల విషయమై తనిఖీలు చేపట్టారు. ప్రతి ఇంట్లో ఇంకా ఏమైనా కోళ్లు ఉన్నాయా అనే విషయాలను కూడా ఈ బృందం సభ్యులు డాక్టర్ షబానా, డాక్టర్ ప్రీతి సాల్మన్, జేవీవో ఆరిఫ్‌లు నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమౌర్య మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన ఈ గుమ్మలదిబ్బ గ్రామంలో మూడు నెలల పాటు చికెన్, కోడిగుడ్ల అమ్మకాలు చేయరాదన్నారు. ఈ మేరకు ఈ గ్రామంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు.

## సోలార్ కనెక్షన్ తీసుకొండి రు. 75వేలు సబ్సిడీ పొందండి; యస్ఇ విజయన్



**కలిగిరి, మార్చి02, ప్రభాతవార్త;** గృహ అవసరాలకు ప్రతిఒక్కరూ సోలార్ కనెక్షన్ తీసుకొని ప్రభుత్వం నుండి రు. 75వేలరూపాయల సబ్సిడీ పొం దాలని విద్యుత్‌శాఖ నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరు వి. విజయన్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన కలిగిరిలో పర్యటించిన యస్ఇ మీటర్ రీడింగ్లను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రభాత'వార్త'తో మాట్లాడుతూ ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి ఇంటి యజమానులకు ఒక చక్కని అవ కాశం కల్పించిందన్నారు. గృహాలకు సంభం దించి 300యూనిట్లు లోపల కరెంట్ వినియోగించేవారు సోలార్ విద్యుత్‌వాడుకోవచ్చన్నారు. అలా ముందు కు వచ్చిన వారికి ప్రభుత్వం కూడాప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. సోలార్ విద్యుత్‌కావలనుకొనేవారికి ప్రభు త్వం 3క్యాటగిరిల్లో సబ్సిడీకూడా ఏర్పాటు చేస్తుందన్నారు. ఒక కిలోవాట్స్‌కి 30వేలు, 2కిలోవాట్స్‌కిరు. 60వేలు, 3కిలోవాట్స్‌కైతే రు.75వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇంతేగాక బ్యాంకులుకూడా సోలార్ విద్యు త్‌వాడకం దారులకు ఋణాలుకూడా ఇస్తారన్నారు. సోలార్ విద్యుత్‌వాడినందువల్ల కరెంట్‌కర్చుకూడా గణనీ యంగా తగ్గించుకోవచ్చన్నారు. ఇప్పటికే ఈసిస్టమ్ అనేక రాష్ట్రాలలో అమలౌతుందని ఈ అవకాశాన్ని 300 లోపు యూనిట్లు వాడే వినియోగదారులు తప్పక ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చన్నారు. యస్.ఇ గారివెంట ఎడిఇ బి. క్రిష్ణమోహన్, ఎఇ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్



**ఉదయగిరి, మార్చి2, ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ ఎన్నికల ఆదేశాల మేరకు ప్రతిఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల సదుపాయాలు సజావుగా ఉన్నాయా లేదా అని తెలుసుకునే విధానంలో భాగంగా ఉదయగిరి రావడం జరిగిందని తెలిపారు. రాబోయే ఎన్నికలు నెల్లూరు జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా అన్ని రకాల ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మరికొన్ని రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న సందర్భంగా అధికారు లందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కావలి శివాలయంలో కుంభమాస తిరునాళ్ళ ప్రారంభం

**కావలి, మార్చి 2 ప్రభాతవార్త** కావలి పట్టణంలో వేంచేసి వున్న శ్రీ దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 2వ తేది నుంచి 12వ తేది వరకు 11 రోజుల పాటు కావలి శివాలయం కుంభమాస తిరునాళ్లు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక అర్చకులు ఎ.ఆర్.శశిధర్‌గురుకుల్, ధర్మకర్త కసవరాజు వెంకట మల్లికార్జున కృష్ణమోహన్‌లు తెలిపారు. శనివారం దురాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి విశేష అభిషేకార్చనలు, రాత్రికి అంకురార్పణలు జరిగాయి. ఈ నెల 3వ తేది ఉదయం విశేష అభిషేకార్చనలు, వాస్తు హోమం, వాస్తు బలి, సాయంత్రం ధ్వజారోహణ, రాత్రికి శేషసేవ గ్రామోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 4వ తేది ఉదయం విశేష అభిషేకార్చనలు, హోమం, బలిహరణ, పల్లకీ సేవ, రాత్రికి భృంగీశ్వర సేవ, గ్రామోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 5వ తేది విశేష అభిషేకార్చనలు, హోమం, బలిహరణ, పల్లకీ సేవ, రాత్రికి హంసవాహన సేవ గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు. 6వ తేది విశేష అభిషేకార్చనలు, హోమం, బలిహరణ, పల్లకీ సేవ, రాత్రికి మృగరాజ సేవ గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు. 7వ తేది విశేష అభిషేకార్చనలు, హోమం, బలిహరణ, పల్లకీ సేవ, రాత్రికి రావణేశ్వరసేవ, గ్రామోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 8వ తేది మహాశివరాత్రి సందర్భంగా ఉదయం గిన్నె బిక్ష హోమం, పల్లకీ సేవ, విశేషాభిషేకార్చనలు, రాత్రికి మహాలింగోద్భవం, నందిసేవ, గ్రామోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 9వ తేది విశేష అభిషేకార్చనలు, హోమం, బలిహరణ, పల్లకీ సేవ, రాత్రికి కళ్యాణం, ఏనుగ సేవ గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు. 10వ తేది విశేష అభిషేకార్చనలు, హోమం, బలిహరణ, పల్లకీ సేవ, మధ్యాహ్నం రథోత్సవం, రాత్రికి చంద్రమండల వాహన సేవ గ్రామోత్సవం జరుగుతాయని తెలిపారు. 11వ తేది ఉదయం విశేష అభిషేకార్చనలు, మధ్యాహ్నం త్రిశూల స్నానం, వసంతోత్సవం, రాత్రికి అశ్వసేవ, గ్రామోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 12వ తేది ఉదయం విశేష అభిషేకార్చనలు, మధ్యాహ్నం శివగామిని సమేత ఆనంద నటరాజస్వామి సేవా సంఘం సౌజన్యంతో అన్నసంతర్పణ, రాత్రికి తెప్పోత్సవం, ఏకాంత సేవలు వుంటాయని తెలిపారు. 11 రోజుల పాటు శివగామిని సమేత ఆనంద నటరాజ స్వామి సేవా సంఘం వారి సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 4వ తేది సాయంత్రం హైదరాబాద్ వాస్తవ్యులు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి దివ్య ప్రవచనం వుంటుందని భక్తులు పాల్గొనాలని తెలిపారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో మాఘమాస శనివారం పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

# జరిగేది కురుక్షేత్ర యుద్ధం

**నెల్లూరు రూరల్, మార్చి 2, ప్రభాతవార్త** వచ్చే ఎన్నికలు మహా కురుక్షేత్రమని ఈ యుద్ధంలో అంతిమ విజయం తమదేనని, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అహంకారంతో ఇష్టానుసారంగా ఈ రాష్ట్రాన్ని విధ్వంసం చేసి రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేస్తున్న వ్యక్తిని ఇంటికి పంపించే బాధ్యత మనందరి మీద ఉందని నారా చంద్రబాబునాయుడు అన్నారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు రూరల్ కనపర్తిపాడు వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతో పాటు జిల్లా ముఖ్య నేతలు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఆంధ్ర ప్రజల ప్రయోజనాల కోసం భావితరాల భవిష్యత్తు కోసం మనందరం ఏకమై అరాచక పాలన అంతమొందించాలని, అరాచక పాలన అంతమొందించేందుకు మనమంతా ఏకతాటిపై నడవాలని అన్నారు. అధికారం శాశ్వితం కాదని, సమాజం శాశ్వతం అని, అది కూడా తెలియని ఇంగిత జ్ఞానం లేని వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆయన ఒంటెద్దు పోకడలు నచ్చక.. వాళ్ళ పార్టీ వాళ్లే పలాయనం చిత్తుగిస్తున్నారని ఎద్దేవ చేశారు. అలాంటి వ్యక్తికి బంగపాటు తప్పదని చంద్రబాబు అన్నారు. రాబోయేది తెలుగుదేశం, జనసేన ప్రభుత్వమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పాదయాత్ర చేసిన సొంత చెల్లినే టిష్యూ పేపర్‌వాడి పడేసినట్లు జగన్‌మోన్‌రెడ్డి వదిలేశాడని విమర్శించారు. ఒక పార్టీ అధ్యక్షురాలుగా మరో పార్టీని విమర్శించడం సర్వసాధారణమని సబాలుగా స్వీకరించాలని తప్ప వ్యక్తిగత దూషణలకు దిగి ఆమె పుట్టుకనే అవమానించిన మనసు లేని మనిషి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రపంచంలోనే ఏ ముఖ్యమంత్రికి పెట్టని ముద్దు పేరు సైకో ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందని అన్నారు. త్వరలోనే ఎన్నికలు వస్తున్నాయని ఎన్నికల సమయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రోడ్లమీద తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంటుందని చంద్రబాబు చెప్పారు.





టీడీపీలో చేరిన వీపీఆర్ దంపతులు

### ఫస్ట్ సర్వేలోనే సూపర్ సక్సెస్ వీపీఆర్

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అజాతశత్రువు, ప్రజాసేవకు మారు పేరు, అలాంటి వ్యక్తి తెలుగుదేశం పార్టీలోకి రావడంతో జిల్లాలో నూతన ఉత్సాహం వచ్చిందని నారా చంద్రబాబునాయుడు అన్నారు. నెల్లూరు కనపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిను ఉద్దేశించి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మొదటి సర్వేలోనే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూపర్ సక్సెస్ అన్నారు. నెల్లూరు పార్లమెంట్‌లో సునాయాసంగా గెలుస్తామనే ధీమా వ్యక్తం చేశారు. వేమిరెడ్డి లాంటి ఓ మంచి వ్యక్తి ప్రజలకు సేవ అందించాలని అని వచ్చిన వ్యక్తిని మనస్ఫూర్తిగా మీ అందరి తరుపున పార్టీలోకి ఆహ్వానిస్తున్నానని తెలిపారు. వారితో కూడా వారి శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కూడా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సాహం చూస్తుంటే జిల్లాలో వైసీపీ ఖాళీ అయిపోతుందని ఆయన అన్నారు. మనమందరం ఒక కుటుంబం అని, గౌరవం తప్పకుండా ఉంటుందని, పార్టీలో తగిన స్థానం ఇస్తామన్నారు. ప్రజా సేవకు అంకితమైన ఎవరు వచ్చిన సగర్వంగా ఆహ్వానిస్తామని చంద్రబాబునాయుడు తెలిపారు. వేమిరెడ్డి టీడీపీలో చేరుతున్నాడని తెలిసిన వెంటనే విశాఖలో దోచేసిన విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పంపిస్తున్నారని నెల్లూరుని దోచుకోవాలనుకుంటున్నారు. అలాంటి వారికి నెల్లూరు ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు.

రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటుగా నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగిన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు హాజరై వేమిరెడ్డి దంపతులకు పార్టీ కండువా వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వారితో పాటు జిల్లాలో ముఖ్య నాయకులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నా కృషి దేవుడు ఆశీస్సులతో నా పరిధి మేరకు ప్రజలకు సేవ చేస్తున్నానని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మరింత మందికి సేవ చేయాలంటే ప్రత్యక్ష రాజకీయాలే వేదిక అని రాజకీయాల్లోకి వచ్చా.. నా శ్రేయోభిలాషుల మాటలతో నేను రాజకీయాల వైపు అడుగులు వేశానన్నారు. దైవ నిర్ణయంతోనే నేను తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానన్నారు. నాపై నమ్మకం ఉంచి నాతో తెలుగుదేశం పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికి నేను మీ మనిషిగా ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ప్రజలకు మరింతగా సేవలు చేసేందుకే నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, రూరల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, తాటికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, పనబాక లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు మనుక్రాంత్‌రెడ్డి, మహిళా నాయకురాలు తాళ్లపాక అనురాధ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీలు రాంభూపాల్‌రెడ్డి, శ్రీకాంత్, ఉమ్మడి నెల్లూరు జిల్లా వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 32 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు నివేశన స్థలాలు మంజూరు !



**కావలి, మార్చి 2 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో మొట్లమొదటి సారిగా 32 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు నివేశన స్థలాలు మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రప్రథమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం కావలి పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఇళ్ళ రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నివేశన స్థలాలు మంజూరు చేయడంతో పాటు సబ్సిడీపై ఇసుక, సిమెంట్ తదితర సామాగ్రిని అందజేసి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడమే కాకుండా వాటిని ఆ మహిళలకే సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కావలిలో దాదాపు ఏడు వేల గృహాలు మంజూరు చేయడం కూడా పెద్ద రికార్డు అని అది కేవలం ప్రతాపన్నకే సాధ్యమైందని వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, వైసిపి నేతలు కనమర్ల పూడి వెంకట నారాయణ, పందిటి కామరాజు, కనపర్తి రాజశేఖర్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, వియంయస్‌ఆర్ మాలి, తదితరులు పాల్గొన్నారు.

## పశువులను నియంత్రించకపోతే కఠినచర్యలు తప్పవు



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి2, ప్రభాతవార్త** నగరవ్యాప్తంగా ప్రధాన రోడ్లమీద వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులను వాటి యజమానులు స్వయంగా నియంత్రిచకపోతే కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. పశువులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 2వ రోజు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి కల్లూరుపల్లి గోశాలకు తరలిస్తున్న పశువుల వాహనాన్ని యజమానులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్‌వెంకటరమణ యజమానులతో మాట్లాడుతూ వాహన ప్రమాదాలకు కారణభూతమవుతున్న రోడ్లపై సంచరించే పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మేయర్, కమిషనర్‌ల ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం సహకారంతో గోశాలకు తరలించి వాటి సంరక్షణ బాధ్యతలను నగరపాలక సంస్థ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుందని యజమానులకు తెలిపారు. పశువుల యజమానులు వాళ్ల ప్రాంగణాలలోనే ఉంచుకోవాలని, రోడ్లపై వదిలితే తప్పనిసరిగా వాటిని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జంతువైద్యాధికారి మదన్మోహన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి2, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 15/1 అరుణమ్మ వీధిచ15/2, బాలాజీనగర్-4, 15/3 మేఘనావీధి, అధిత్యనగర్ వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్‌మర్మత్ శనివారం తనిఖీచేశారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన అస్తిపన్ను, ఖాళీస్థలం పన్ను, కుళాయి పన్నులవసూళ్లను వేగవంతంచేసి అపరాద రుసుములేకుండా చెల్లించేలా పన్ను బకాయిదారులకు అవగాహన కల్పించాలని సూచిం చారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులందరికీ పంపిణీ చేయాలని కమిషనర్ సూచించారు. అనంతరం సచివాలయాల్లోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరురిజిస్టర్లు, స్పందన రిజి ష్టర్లలతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పా టించాలని, తమకు నిర్ధేశించిన గడువులోగా లక్ష్యాలను అందుకోవాలని సూచించారు.

## కొత్త చట్టాలపై పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం

**నెల్లూరు క్రైమ్, మార్చి 2, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కొత్త చట్టాలపై నిర్వహించిన ట్రైనింగ్ ఫోగ్రామ్‌లో జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వర్‌రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిరుపతి పోలీసు ట్రైనింగ్ కాలేజీ కళ్యాణి డ్యాం నుండి 6 జిల్లాల పోలీసు అధికారులకు 6 రోజుల పాటు నిర్వహించనున్నారు. ట్రైనింగ్‌లో పాల్గొన్న నెల్లూరు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది. సోమవారం నుండి శనివారం (ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2)వరకు ఆరు రోజులలో ప్రతి రోజు రెండు గంటల పాటు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తరగతులు నిర్వహించారు. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన సుమారు 2900 మంది పోలీసు అధికారులు, సిబ్బంది తమ తమ కార్యాలయాలు, పోలీసు స్టేషన్ల నుండి తరగతులలో పాల్గొన్నారు. హైదరాబాద్ కేంద్ర ప్రభుత్వ ట్రైనింగ్ సెంటర్లో వారం రోజుల పాటు శిక్షణ పొందిన అధికారులచే తరగతులు. ఇప్పటికే 9 జిల్లాలకు చెందిన రెండు బ్యాచ్‌ల అధికారులకు(80) రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహణ. ఎన్నికలు సమీపిస్తున్న కారణంగా పోలసు అధికారులు, సిబ్బంది పలు రకాల విధులలో నిమగ్నమై ఉన్నందున జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తరగతులు నిర్వహించారు. ట్రైనింగ్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనింగ్ నిర్వాహకులను, పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ



**కలువాయి మార్చి 2 ప్రభాతవార్త :** మండలంలోని తెలుగురాయిపురం ఎస్‌సి,బిసి కాలనీ నందు పల్స్ పోలియోపై శనివారం ర్యాలీ నిర్వహించారు.నేడు పల్స్ పోలియో సందర్భంగా 0 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికి నూరుశాతం పోలియో చుక్కలు తల్లిదండ్రులు వారి పిల్లలకు వేయించాలని తెలుగురాయిపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి మురళీకృష్ణా కోరారు.పల్స్ పోలియో పిల్లలకు వేయించడం పై జరిగే మంచిని తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నిండు జీవితానికి రెండు చుక్కలు అంటు నినాదాలతో విద్యార్థులు,ఉపాధ్యాయులు గ్రామస్తులు ర్యాలీలో పాల్గొన్నారు.మురళీకృష్ణాతోపాటు ఎఎన్‌ఎం భువనేశ్వరీ,ఆశావర్కర్లు ఎస్ భాగ్యమ్మ,సంధ్య,చిన్నారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

**నెల్లూరు టౌన్, మార్చి 3, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలోని వెనుకబడిన తరగతుల వసతి గృహాల విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం నెల్లూరు నగరం కొండయ్యపాలెం గేట్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో ఏఐఎస్‌బి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలను కొందరు వార్డెన్లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డీబీసీడబ్ల్యూఓ సైతం అక్రమాలకు పాల్పడే వార్డెన్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వీటిపై విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ డిమాండ్ చేశారు. జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో కొందరు వార్డెన్లు విద్యార్థులకు కడుపునిండా అన్నం కూడా పెట్టకుండా దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడే కొందరు వార్డెన్‌లపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే తప్పులు సరిదిద్దుకోవాల్సింది పోయి అందుకు భిన్నంగా తమపైనే ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. బీసీ వసతి గృహాలు జైలు కన్నా అధ్వానరీతిలో ఉన్నాయని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుండా వార్డెన్లు కొందరు రోజు వారి విధులకు హాజరుకాకుండా తమ స్వార్థ లాభ ప్రయోజనాల కోసం ప్రభుత్వ సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. బోగస్ అడ్మిషన్స్ పెట్టుకొని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన డీబీసీడబ్ల్యూఓ వార్డెన్లకు ఒత్తాసు పలుకుతూ అవినీతి అక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారని వారు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఇప్పటికైనా నెల్లూరు జిల్లా వ్యాప్తంగా బీసీ వసతి గృహాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడే వసతి గృహ సంక్షేమ అధికారులపై సోమవారం నాడు జిల్లా కలెక్టర్, మంత్రులను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. అప్పటికి సమస్యలపై స్పందించకపోతే నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు వివిఎస్ చైతన్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్, ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి త్రినాథ్, బీవీవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు రాజా, పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి సునీల్, ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కరిముల్లా, డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చంద్ర, పీఎస్‌యు రాష్ట్ర మెంబరు హరిరెడ్డి, విద్యార్థి జేఏసీ ఆదిత్య సాయి పాల్గొన్నారు.

## నేను మీ వాడినే- బుర్రా మధుసూదన్‌యాదవ్



**ఉలవపాడు, మార్చి 2, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం కరేడులో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్ శనివారం పరిచయ వేదిక నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి ముఖ్యమంత్రిని చేద్దామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. నేను మీ వాడినే కందుకూరు నియోజకవర్గంలో వైసీపీ జెండాను మనందరం కలిసికట్టుగా పనిచేసి వైసీపీ జెండాని ఎగరవేద్దామని ఆయన తెలిపారు. నవరత్నాలు కావాలంటే మనందరం కలిసి సంక్షేమ పథకాలు పొందిన వారిమే కనుక మనందరం కలిసికట్టుగా పనిచేసి వైసీపీని గెలిపిద్దామని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమానికి ముందు కరేడులోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరేడు గ్రామ ప్రజలు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు రామాల సింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మున్నం పోతురాజు, ఎంపీటీసీ ఫజల్, కోఆప్షన్ నెంబర్ ఖాదర్ భాష, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోశాల షెడ్‌ను ప్రారంభించిన కందల రాజారెడ్డి



**అల్లూరు, మార్చి 2 ప్రభాతవార్త :** అల్లూరు మండల పరిధిలోని వెలిచర్ల గ్రామంలో శనివారం గోశాల షెడ్‌ను కెఎస్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ కందల రాజారెడ్డి ప్రారంభించారు. గోశాలలో ఆవుల సంరక్షణకు నిర్మించిన షెడ్‌కు పూజా కార్యక్రమాలు నిర్వహించి కందల రాజారెడ్డి చేతుల మీదుగా స్థానికులు, కందల రాజారెడ్డి అభిమానుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల నిర్వాహకులు అక్కడ వున్న ఆవులకు షెడ్లు నిర్మించమని కోరగా గోసంరక్షణకు షెడ్‌ను నిర్మించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో కెఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. పూజా కార్యక్రమాన్ని అనంతయ్య స్వామి శాస్త్రోక్తంగా నిర్వహించారు.పూజా కార్యక్రమంలో నలగట్ల శేఖర్ దంపతులు, కమల్‌సింగ్ దంపతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, జోసఫ్, వినయ్, సిద్దా రమణయ్య, డి.వి.బ్రహ్మానందరావు, దేవళ్ళ హరిప్రసాద్‌రెడ్డి, గోశాల నిర్వాహకులు, స్థానికులు, కందల రాజారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## కలిగిరిలో రోడ్డుసైడ్ బిల్డింగులు కూల్చివేత.



**కలిగిరి,మార్చి02, ప్రభాతవార్త;** ఉదయగిరి, కావలి హైవే రోడ్డు వెడల్పులో బాగంగా కలిగిరి మండల తాసిల్దారు కార్యాలయం ఎదుట బిల్డింగులనుసంబంధిత అధికారులు పడకొడుతున్నారు. నేషనల్‌హైవే వెడల్పులో బాగంగా ఉదయగిరి, కావలిరోడ్డుపనులు జరుగుతున్నారు. ఈ క్రమంలో కలిగిరిలోని రోడ్డుకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న బిల్డింగులకు ప్రభుత్వం ఇప్పటికే నష్ట పరిహారం చెల్లించి ఉంది. అయితే గతంలో ఒకసారి ఈ బిల్డింగులనుపడకొట్టేందుకు సంభందిత అధికారులు పూనుకోగా తమకు కొంత గడువుకావాలనిఇళ్ల యజమానులు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో వెనుదిరిగి పోయారు. ఈక్రమంలో శనివారం సంబందిత అధికారులు జెసిపిల సహాయంతో రోడ్డుకు అవసరమైన బిల్డింగులను పడవేసేకార్యక్రమం చేపట్టారు.

## చంద్రబాబు సభకు హాజరైన తెలుగుతమ్ముళ్లు.



**కలిగిరి, మార్చి02, ప్రభాతవార్త;** నెల్లూరు జరిగిన తెలుగుదేశం పార్టీ అదినేత నారాచంద్రబాబునాయుడు సభకు కలిగిరినుండి టిడిపి నాయకులు, కార్యకర్తలుపెద్దఎత్తున బయలు దేరినారు. ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు కాకర్ల సురేష్ ఆద్వర్యంలో కలిగిరి మండలంలోని అనేక గ్రామాలనుండి నాయకులు, అభిమానులు బయలు దేరారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ కాకర్ల ట్రస్ట్అదినేత కాకర్ల సురేష్ తమ గ్రామాలకు ఎంతగానో సాయ పడ్డారని అందుకోసమే సురేష్ పిలుపు మేరకు చంద్రబాబునాయుడు సభలకు హాజరౌతున్నామన్నారు.టిడిపినాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు;తన మాటమన్నించితాను పిలవంగానే మండలంలోని అన్నిగ్రామాలనుండి చంద్రబాబు మీటింగుకి బయలు దేరిని తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,కాకర్ల ట్రష్టు అభిమానులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కాకర్ల ట్రష్టు అదినేత, ఉదయగిరి టిడిపి నాయకులు కాకర్ల సురేష్ఓ ప్రకటనలో తెలిపారు.

## ప్రతి లబ్ది దారుని చేరిన మోడీ పథకాలు.



**కలిగిరి, మార్చి02, ప్రభాతవార్త;** భారత దేశంలోని ప్రతి ఒక్క లబ్ది దారునికి భారత ప్రదాని నరేంద్రమోడా ప్రవేవ పెట్టిన పథకాలు అందినవి అని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సబ్యులు నందనవనం ప్రభాకర్‌రావు తెలిపారు. శనివారం కలిగిరిలో ప్రదాన మంత్రి పథకాల లబ్దిదారుల సంపర్క్ అబియాన్ సమావేశం జరిగింది.కిసాన్ మోర్చా రాష్ట్రఉపాధ్యక్షులు సుదాకర్‌రెడ్డి అద్యక్షతన జరిగినమోదీ ప్రవేశపెట్టిన పథకాలతో ఇప్పటికి 25కోట్లమంది భారత దేశంలో పేదరికంనుండి దూరం చేయడం జరిగిందన్నారు.అందుచేత ప్రతికార్యకర్త మోడీ పథకాల లబ్దిదారులను కలసి వారికిప్రదాని వ్యకగతంగా రాసిన ప్రత్యేక లేఖలను అదించి వారి అబిప్రాయాలను, సూచనలను తెలుసుకొని, నరేంద్రమోడీకి తెలిజేయాల్సింది ప్రదానికోరినట్లుఈ సమావేవంలో తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట నాయకులు నాయకులు హనుమాన్‌రెడ్డి, షాజహాన్ ,నియోజకవర్గనాయకులు రమేష్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్షులునాయకులు చంద్రమౌళి,వెంకట స్వామినా యుడు, మల్లికార్జున, హరగోపాల్‌రెడ్డి, ప్రభాకర్,రమణయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి,శ్రీనివాసులరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

**సంగం మార్చి 2 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సంగంలో ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై డాక్టర్ అశోక్‌కుమార్ నేతృత్వంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతు 0 నుండి 5 ఏళ్ల చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు. మండలంలో 3543 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.42 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పల్స్‌పోలియో

**మనుబోలు, మార్చి 2, ప్రభాతవార్త :** మనుబోలు మండలంలో ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు మండల వైద్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ వైద్యులు కే.పూజిత, ఎస్‌కే మోజినసుల్తానా పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తారు. 4568 మంది చిన్నారులను గుర్తించి 40 సెంట్రల్‌లో ఆరు రూప్‌లో ఈ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 166 మంది సిబ్బందిని ఈ పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణకు అటు ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పల్స్ పోలియో విజయవంతానికి నియమించారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నాగేటి ఆనంద్ ఆధ్వర్యంలో స్థానిక కోదండరామపురం సెంటర్‌లో ప్రత్యేక పోలియో సెంటర్‌ను నిర్వహిస్తారు. నెల్లూరు, గూడూరు మధ్య మనుబోలు మీదుగా ప్రయాణించే ప్రయాణికులకు సంబంధించిన చిన్నారులకు ఈ బస్ షెల్టర్ వద్ద బస్సులు ఎక్కి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ శాంతి సేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో కోదండరామపురం బస్ షెల్టర్ వద్ద తమ సిబ్బంది సేవలు అందిస్తున్నారని ఆదివారం జరిగే పల్స్ పోలియోలో బస్సులో ప్రయాణించే చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు.

## చంద్రబాబు సమక్షంలో టిడిపి తీర్ధం పుచ్చుకున్న మెట్టుకూరి కుటుంభం.



**కలిగిరి,మార్చి02, ప్రభాతవార్త;** టిడిపి అదినేత చంద్రబాబు సమక్షంలో కలిగిరిమండల నాయకులు టిడిపి తీర్ధం పుచ్చుకున్నారు.శనివారం జిల్లాకువచ్చిన చంద్రబాబు సభకు కలిగిరి మండలంనుండి బారీ స్తాయిలో బయలు దేవారు. ఈసందర్బంగా మండలసీనియర్ నాయకులు, మాజీ మండలాధ్యక్షులు మెటుకూరి రామిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మెటుకూరి రాంజీవిరెడ్డి,మాజీ మండలాద్యక్షులు మద్దసాని వెంకటేశ్వర్లు,వైసిపి సీనియర్ నాయకులు, మాజీ యంపిటీసి సబ్యులు మరికొంతమంది బాబు సమక్షంలో టిడిపి తీర్ధపుచ్చుకున్నారు.ఈసందర్బంగా రామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా పెద్దాయన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపుమేరకు టిడిపిలోచేరినట్లు వారు ప్రకటించారు. పార్టీకి విదేయులుగాఉంటూ ఉదయగిరి దేశం గెలుపులో తమవంతు పాత్రపోషిస్తామన్నారు.

## చంద్రబాబును కలిసిన చంచల్‌బాబు యాదవ్



**ఉదయగిరి,మార్చి2,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం నుండి నెల్లూరులో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి చంచల్‌బాబుయాదవ్ పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడిని కలిసిన చంచల్‌బాబు యాదవ్ ఉదయగిరి రాజకీయాలపై పలు విషయాలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు.చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో చంచల్‌బాబు యాదవ్‌కు పార్టీలో సముచితమైన స్థానాన్ని కల్పిస్తానని గట్టిగా హామీ ఇచ్చానని తెలిపారు.వేమిరెడ్డి ప్రభాకర్‌రెట్టి టిడిపిలోకి రావడంతో నెల్లూరు జిల్లా టిడిపి మరింత బలపడిందని ఆయన తెలిపారు.

## నేడే పల్స్‌పోలియో కార్యక్రమం



**ఉదయగిరి,మార్చి2,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద గండిపాలెం ప్రాధమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ శివకల్పనారెడ్డి తన సిబ్బందితో కలిసి మార్చి3వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 5ఏళ్లలోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని,పిల్లల తల్లిదండ్రులు తమ చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని,పోలియో మహమ్మారిని దరిచేరనీయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.రేపుజరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని,పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనని పశిపిల్లలకోరకు ఇంటింటి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు అందేవిధంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు,ఆశాకార్యకర్తలు,ఆయాలు ఆరోగ్య విద్యాధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపిన టంగుటూరు



**బుచ్చి మార్చి 2 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం వవ్వేరు రూరల్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా నూతనంగా నియమితులైన టంగుటూరు మల్లికార్జునరెడ్డి కోవూరు శాసనసభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో బుచ్చి నగరపాలక చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ,మోర్ల మురళీ,ఇప్పగుంట విజయ్‌భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు కోటంరెడ్డి లలితారెడ్డి,షేక్ షాహుల్, షేక్ .షకీలాబేగం, బెళ్లం మల్లారెడ్డి,చీర్ల ప్రసాద్‌యాదవ్, మైనార్టీనాయకులు షేక్ అల్లాబక్ష్, కౌన్సిలర్లు యానాదిరెడ్డి, బిట్రగుంట ప్రమీలమ్మ, కంతా అనంతమ్మ, మోర్ల జయంతి, బెళ్లం మల్లారెడ్డి, ఎస్‌సి,ఎస్‌టి విజిలెన్స్ కమీటి సభ్యురాలు బట్టా ప్రవల్లిక,కౌన్సిలర్ నాగరాజు, మోహన్, కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి,మోర్ల భరత్, పిడుగు మధు, రాజ్‌కుమార్,డాక్టర్ అల్లాబక్ష్, కౌన్సిలర్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, బిట్రగుంట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో జగనన్న శాశ్వత భూపట్టాలను పంపిణీ చేసిన తహాశీల్దార్



**ఉదయగిరి,మార్చి2,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని బిట్-2 సచివాలయ పరిధిలో ఉదయగిరి తహశీల్దార్ నెహ్రూబాబు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.ఉదయగిరిలో సచివాలయం-3 పరిధిలోని దాదాపు 320మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికి సొంతింటి కలన సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇళ్లస్థలాలను ఇచ్చి వారిని శాశ్వత హక్కుదారులను చేయడం చాలా గొప్పవిషయమన్నారు.ఇంతకుముందు గద్దెనెక్కిన ప్రభుత్వాలు తమ స్వప్రయోజనాలకే తప్ప బడుగు,బలహీన వర్గాల ప్రజల కోసం ఏమి చేయలేకపోయాయని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం,మృర్తుజా,ఎంపీటీ పెద్దమస్తాని,వక్స్ బోర్డు ఎస్‌దాని,విఆర్‌వోలు బిల్లుపాటి వెంకటేశ్వర్లు,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్న చేజర్ల సుబ్బారెడ్డి



**ఉదయగిరి,మార్చి2,ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలలో భాగంగా శనివారం ఉదయగిరి నుండి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి,మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 200మంది తమ అనుచరగణంతో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేజర్ల సుబ్బారెడ్డికి,ఆయన అనుచరులకు పార్టీ కండువాకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా చేజర్ల సుబ్బరెడ్డి మాట్లాడుతూ తన దైవసమానమైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు ఆయనతో కలిసి నడవడానికి నిర్ణయించుకున్నామని,రాబోయే రోజుల్లో టిడిపి నాయకుల సూచనల మేరకు పార్టీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పుటూరి హరి,బాలిబోయిన శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్వల ఉచిత గ్యాస్ కనక్షన్లు పంపిణి



**బుచ్చి మార్చి 2 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో నాయకులు ఉచిత ఉజ్వల గ్యాస్ కనక్షన్లు మహిళలకు పంపిణి చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా మోర్చ బిజెపి జిల్లా అద్యక్షురాలు కరణం సుహాసిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు భారతదేశంలో మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడ్డానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఉచితంగా మరుగుదొడ్ల నిర్మాణం చేయిస్తున్నారని అన్నారు.వంట చేసే సమయంలో మహిళలకు కళ్ళలో ఆనందం చూడాలని గ్యాస్ కనక్షన్లు పంపిణి చేశారని అన్నారు. భారతదేశంలో మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఏకైక నాయకుడు భారత ప్రధాని నరేంద్రమోడీ అని ఆమె ప్రశంసించారు. ఈకార్యక్రమంలో మహిళా నాయకులను స్థానిక మహిళలు శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యురాలు బిజెపి సీనియర్ నాయకురాలు రామిశెట్టి రమణమ్మ,జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, మహిళా మోర్చ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గంట విజయ శ్రీ, మహిళా మోర్చ జిల్లా ప్రధానకార్యదర్శి పైడిమర్రి సుజనా, ఎస్‌సి మోర్చ జిల్లా ఉపాధ్యాక్షులు గోళ్ళ నరసింహులు, బిజెపి సీనియర్ నాయకులు పైడా పెంచలస్వామి, బిజెవైఎం మండలాద్యక్షులు గోలి సురేంద్ర, ఓబిసి మోర్చ మండల ప్రధాన కార్యదర్శి నీలం వెంకటేశ్వర్లు, చిలకాల నడిపే గురవయ్య, మహిలు పాల్గొన్నారు.

## కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడిని కలిసి తెలుగుతమ్ముళ్లు



**ఉదయగిరి,మార్చి2,ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి నుండి భారీ సంఖ్యలో నెల్లూరులో జరిగిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరే కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఉదయగిరి నియోజకవర్గ టిడిపి శాసనసభ్య అభ్యర్థి కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమానికి భారీస్థాయిలో తరలివచ్చిన టిడిపి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు రవాణా సౌకర్యాన్ని కాకర్ల సురేష్ ఏర్పాటు చేయడం జరిగింది.దాదాపుగా 500కార్లతో కోలాహలంగా ఉదయగిరి నియోజకవర్గం నుండి బయలుదేరి తెలుగుదేశం కార్యాలయం నుండి బయలుదేరి నారా చంద్రబాబునాయుడిని కలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరడం శుభసూచికమని,నెల్లూరు జిల్లాలో టిడిపి ప్రభంజనం మొదలైందని అన్నారు.నేడు టిడిపి పార్టీ నిర్వహించిన కార్యక్రమానికి తరలివచ్చిన భారీ జనసందోహాన్ని చూస్తేనే తెలుగుదేశం పార్టీ మరళా పూర్వ వైభవాన్ని అందిపుచ్చుకున్నదని ఆయన అన్నారు.తెలుగుదేశం పార్టీ నాయకుల నుండి అభిమానులు,కార్యకర్తలు, స్వచ్ఛందంగా ఇంతభారీ సంఖ్యలో తరలిరావడం నాకు మద్దతుగా వచ్చినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపినట్లు తెలిపారు.ఇదేవిధంగా రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం గట్టిగా కృషి చేయాలని,చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేదాకా ఎవరూ అలసత్వం ప్రదర్శించకూడదని ఆయన కార్యకర్తలకు సూచించారు.రాబోయే 2రోజుల్లో తెలుగుదేశం పార్టీ జాతీయ యువనేత నారా లోకేష్ ఉదయగిరి పర్యటన సందర్భంగా భారీస్థాయిలో టిడిపి మద్దతు దారులు పాల్గొనాలని,ఉదయగిరి నియోజకవర్గ టిడిపి కంచుకోట అని నిరూపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన 8మండలాల నాయకులు,కన్వీనర్లు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఇంటర్ పరీక్షలు



**బిట్రగుంట, మార్చి 2 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కట్టుదిట్ట భద్రత ఏర్పాట్ల మధ్య ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కావలి రూరల్ సిఐ నాగభూషణం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ ఖచ్చితంగా అమలు చేయాలని పోలీస్ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

## కొండబిట్రగుంటలో ప్రత్యేక పూజలు



బిట్రగుంట, మార్చి 2 ప్రభాతవార్త బోగోలు మండలం కొండబిట్ర గుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. దేవస్థానంలో అన్నదానం, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ పర్యవేక్షించారు.

## కావలి పట్టణ జనసేన పార్టీ వార్డుల అధ్యక్షులతో ఆత్మీయ సమావేశం




**కావలి రూరల్, మార్చి 2 ప్రభాతవార్త** జనసేన పార్టీ కావలి మున్సిపాల్టీ వార్డుల అధ్యక్షులతో శనివారం కావలి జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అళహరి సుధాకర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కావలి మున్సిపల్ వార్డుల అధ్యక్షుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. టిడిపి వార్డు ఇన్‌చార్జులు జనసేన వార్డుల అధ్యక్షులతో కలిసి వెళ్లే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డితో కలిసి కార్యాచరణ రూపొందించి వార్డుల అధ్యక్షులకు తెలియజేయడం జరుగతుందన్నారు. జనసేన పార్టీ టిడిపి పక్కన నడుస్తుంది కానీ వెనుక నడవదన్నారు. మీకు అవమానం జరిగితే నాకు జరిగినట్లేనని, నాకు జరిగితే పవన్‌కళ్యాణ్‌కు జరిగినట్లేనని కాబట్టి ప్రతి ఒక్క జనసేన కార్యకర్త హుందాగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మీ పోలింగ్ బూత్‌లలో బూత్ ఇన్‌చార్జులకు దిశానిర్దేశం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కావలి పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయి, అధికార ప్రతినిధి రుషికేష్, కోఆర్డినేటర్ సుధీర్‌లు వార్డుల అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షులు నాగార్జున, గాదంశెట్టి రవి, తోట శరణ్, ఆలా శ్రీనాథ్, మస్తాన్, మురళి, కృష్ణయ్య, జానీ, నాని తదితర నాయకులు పాల్గొన్నారు.

## బియంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు బహుమతులు



**కావలి రూరల్, మార్చి 2 ప్రభాతవార్త** కావలిలోని డాక్టర్ లక్ష్మీకృష్ణారావు విశ్వోదయ బాలుర పాఠశాల 65వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీద మస్తాన్‌రావు ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా బియంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన సతీమణి బీద మంజులమ్మ పేరు మీద గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలలో మొదటి స్థానం సాధించిన ఎస్.మహేష్‌కు 7 వేల రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన జి.సుమంత్‌కు 3 వేల రూపాయలు నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పాల్గొన్న విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ కరసాల రోశయ్య, కావలి ఎంఇవో గోవిందయ్య, పాఠశాల కరస్పాండెంట్ వై.విజయ శేఖర్‌రెడ్డి, విశ్రాంత ప్రధనోపాధ్యాయిని సి.శారద, ప్రధానోపాధ్యాయులు ద్వారకానాథ్‌ల సమక్షంలో విద్యార్థులకు నగదు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయని విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బియంఆర్ ఆఫీస్ సిబ్బంది పి.సుధాకర్, ఎస్.కె.ఖాదర్‌బాషా, గోళ్ల మురళి, ఉపాధ్యాయులు కళ్యాణి, బ్రహ్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి రూరల్, మార్చి 2 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం పెదపట్టపుపాళెం గ్రామంలో నూతనంగా వేసిన సిసి రోడ్లను శనివారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రతి గ్రామంలో మౌళిక వసతులు కల్పించేందుకు సిసి రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కావలి మండల జెసిఎస్ కన్వీనర్ నాగన్నగారి శ్రీనివాసులు, వైసిపి నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరులోని టీఎన్‌సీ కళాశాలలో శనివారం ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం ఈ పరీక్షలకు 336 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 15 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పరీక్షల అధికారి షఫియా భాను తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ ప్రాంతంలో 144 సెక్షన్ విధించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో మాఘమాస శనివారం పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## పోలియో చుక్కలకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం పల్స్ పోలియోకు సంబంధించి వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులతో ఇనమడుగు పురవీధుల్లో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఇందుకు తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సహకరించలన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయడం జరుగుతుం దన్నారు. మొత్తం మండలంలో 7408 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. మండలంలో 70 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి 7 రూట్‌లుగా విభజించడం జరిగిందన్నారు. ఒక మొబైల్ టీమ్ మండలంలో తిరుగుతూ ఉంటుందన్నారు. ఏ కారణం చేతనైనా ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులకు మార్చి 4,5,6 తేదీల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఈ పోలియో చుక్కలను వేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఐదేళ్ళలోపు వారందరికి పోలియో చుక్కలు తప్పనిసరి




**నెల్లూరు మార్చి 2, ప్రభాతవార్త-వైద్యం** ఐదేళ్ళ వయస్సులోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య పిలుపునిచ్చాడు. శనివారం నగరంలోని గాంధీబొమ్మ కూడలి నుండి విఆర్సీ కూడలి వరకు నర్సింగ్ విద్యార్థులతో పల్స్‌పోలియో అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈనెల 3న ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వివిధ ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపాడు. జిల్లాలో సుమారు 5.30లక్షలమంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలియచేశాడు. పోలియో విషయంపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, తమ తమ బిడ్డలకు పోలియో చుక్కలను వేయించాల్సిన బాధ్యత ఉందన్నాడు. ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులకు ఈనెల 4, 5, 6 తారీఖుల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పాడు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ షేక్ ఖాదర్‌వలి, పిఎంపి అసోసియేషన్, రోటరీ క్లబ్, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

## మరోసారి నరేంద్రమోదీని ప్రధానిని చేయాలి

**నెల్లూరు మార్చి 2, ప్రభాతవార్త-వైద్యం** పేద, మధ్య తరగతి ప్రజలకోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ప్రధాని నరేంద్రమోదీని, మరోసారి ప్రధానిగా చేసుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉందని భారతీయ జనతా పార్టీ గిరిజనమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరాడు. అందులో భాగంగా ప్రజలందరితోపాటు ప్రతిఒక్క గిరిజనుడు రానున్న ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీకి ఓటువేసి మోదీని గెలిపించుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉందన్నాడు. స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్ళు గడిచినా ఏపార్టీ కూడా ఇప్పటివరకు గిరిజనులకోసం ప్రత్యేకంగా ఏఒక్క సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టలేదని, అయితే బీజేపీ నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజనుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికి కూడా గిరిజనులు ఇంకా వెనుకబడి ఉన్నారని, ఈసారి కూడా కేంద్రంలో మోదీ ప్రధాని అయితే పూర్తిస్థాయిలో గిరిజనులు ఆర్థికంగా ఎదగలరని, రానున్న ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థిని గెలిపించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపాడు.

## ఏఎస్‌పేటకు ఫ్రీజర్ పంపిణీ




అనుమసముద్రంపేట, మార్చి2,ప్రభాతవార్త : ఏఎస్‌పేట పంచాయతీకి ఆత్మకూరుకు చెందిన శ్రీ సాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఫ్రీజర్‌ను అందజేశారు. గత రెండు నెలల క్రితం ఏఎస్‌పేట సర్పంచ్ షేక్ జిలానీబాషా గ్రామస్తులతో కలసి ఏఎస్‌పేటకు ఫ్రీజర్ కావాలని కంచి పరమేశ్వర్‌రెడ్డిని కోరడంతో వెంటనే స్పందించిన ఆయన శనివారం ఫ్రీజర్‌ను ఏఎస్‌పేటకు తీసుకువచ్చి బహూకరించారు. అలాగే వైకుంఠ రథం ఆత్మకూరులో అందుబాటులో ఉంటుందని అవసరమైన వారు సమాచారం అందించిన వెంటనే ఏఎస్‌పేటకు పంపుతామన్నారు. ఈసందర్భంగా ఏఎస్‌పేట గ్రామస్తులు హిందూ స్మశానానికి బోరు , షెడ్డు ఏర్పాటు చేయాలని పరమేశ్వర్‌రెడ్డిని కోరడంతో త్వరలో బోరు, షెడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు ఏఎస్‌పేట గ్రామస్తుల తరపున కంచి పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, శేషారెడ్డి, ఏఎస్‌పేట గ్రామస్తులు నీలం గోవిందయ్య, సీనయ్య, వెంకటరత్నం తదితరులుపాల్గొన్నారు.

## జనసేన,టిడిపి కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేద్దాం




వరికుంటపాడు, మార్చి 2,ప్రభాతవార్త : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశానుసారం జనసేన,తెలుగుదేశం పార్టీ ల కూటమి అభ్యర్థి విజయానికి ప్రతి జనసైనికుడు కృషి చేయాలని జనసేన మండల అధ్యక్షుడు రసూల్ పఠాన్,సీనియర్ నాయకులు యాదగిరి ప్రభాకర్ రావు లు అన్నారు.శనివారం మండల కేంద్రంలో మండల స్థాయి జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని మండల అధ్యక్షులు రసూల్ పఠాన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా రసూల్ పఠాన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధిని మరిచి,నామమాత్రంగా సంక్షేమం అందిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారనీ,వారీ అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్ళి వివరించాలని సూచించారు.రానున్న ఎన్నికల్లో జనసేన,టిడిపి కూటమి విజయం సాధిస్తే చెప్పిన ప్రతి హామీని తప్పక నేరవేరుస్తామన్నారు.ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు యాదగిరి ప్రభాకర్ రావు మట్లాడుతూ జనసేనాని పవన్ కళ్యాణ్ నిర్ణయానికి ప్రతి జనసైనికుడు కట్టుబడి పని చేయాలన్నారు.పవన్ కళ్యాణ్ ఆశయాలు,ఆశలకు అనుగుణంగా పని చేస్తూ రానున్న ఎన్నికల్లో ఉదయగిరిలో పొత్తులో భాగంగా టిడిపి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు.తప్పకుండా జనసేన అభ్యర్థులు విజయం సాధించి అసెంబ్లీలో ప్రజల గొంతుకను వినిపిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అనంతరం పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న మండల అధ్యక్షుడు రసూల్ పఠాన్ జనసైనికులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమములో తూర్పు చెన్నంపల్లి ఉప సర్పంచ్ బక్కా ఎలీషా,జనసైనికులుకాకుమాను ప్రసాద్,మేడిద వెంకటేశ్వర్లు,శేషం జగ్గయ్య, నిఖిల్,ఉప్పుటూరి కార్తీక్,నీసు కేశవరావు, గోసు కొండయ్య,యాదగిరి సురేష్,శేషం జగ్గయ్య,సోను, మట్టే నరేష్ యాదవ్, మాధవ్,మధు వివిధ గ్రామాల జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

**సైదాపురం, మార్చి 2, ప్రభాతవార్త** మండలంలోని సున్నా నుంచి ఐదు సంవత్సరాల లోపు వయసు కలిగిన చిన్న పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని సైదాపురం పీహెచ్‌సీ వైద్యులు జనార్ధన్, గిద్దలూరు పీహెచ్‌సీ వైద్యులు శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసే నేపథ్యంలో సైదాపురం పీహెచ్‌సీ పరిధిలో 31 బూత్‌లు ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసి 2480 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా గిద్దలూరు పీహెచ్‌సీ పరిధిలో 20 బూత్‌లను ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసి 2083 మంది చిన్నపిల్లలకు నేడు పోలియో చుక్కలు వేయించడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని చిన్న పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వారు కోరారు.

## వసతి దీవెన,విద్యాదీవెన డబ్బులు తల్లి అకౌంట్లలో వేయవద్దు



**కావలి, మార్చి 2 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన నుంచి వచ్చే నిధులు తల్లి అకౌంట్లలో వేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కావలి ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తల్లి అకౌంట్‌లో నిధులు పడటం వల్ల బ్యాంక్ వారు తల్లిదండ్రులు అప్పులు వున్నారని జమ చేసుకుంటున్నారన్నారు. సర్వీస్ చార్జీల కింద బ్యాంకుల్లో డబ్బులు జమ చేసుకుంటున్నారన్నారు. దీంతో మేనేజ్‌మెంట్ వారు ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారన్నారు. రాజ్యాంగబద్దంగా కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మొత్తం కలిపి స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రొఫిషినల్ కోర్సులు, బిటెక్, ఎంటెక్, బిఫార్మసి విద్యార్థులకు డబ్బులు పడకపోవడంతో మరలా అప్పులు చేసి యాజమాన్యానికి డబ్బులు కట్టాల్సి వస్తుందన్నారు. అందుచేత తల్లి అకౌంట్లలో డబ్బులు వేస్తే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజ్యాంగబద్దంగా ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు వచ్చే స్కాలర్‌షిప్‌లు అందరికి కలిపివేయడం వల్ల ఈ విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. అనేక వసతి గృహాలలో భోజనం సరిగా పెట్టడం లేదన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు విడిగా వేయాలన్నారు. వసతి దీవెన, విద్యాదీవెనలో కలపవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, జెడ్డా వాసు, ఆలూరి బ్రహ్మయ్య, రమేష్, చౌటూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో మహిళలు అగ్రభాగాన నిలవాలి




**కావలి, మార్చి 2 ప్రభాతవార్త** అన్ని రంగాలలో మహిళలు అగ్రభాగాన నిలిచేలా అందరు ప్రోత్సహించాలని కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. రెడ్‌క్రాస్, టీం సేవియర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ మాట్లాడారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా, మహిళా సాధికారతకు సంఘీభావంగా సమిష్టి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మీసాల సుశీల, టీం సేవియర్స్ ప్రతినిధులు కీర్తిప్రియ, తేజస్విని, దివ్యశ్రీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జమున, ఉమాశర్మ, సౌందర్యదీపిక, తదితరులు మాట్లాడారు. వారోత్సవాల సందర్భంగా మహిళల శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక రంగాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు దాకారపు రవిప్రకాష్, హరినారపరెడ్డి, రఘుకుమార్‌రెడ్డి, లోకేష్, కృష్ణారెడ్డి, రమణ్ సుందర్, తదితరులు పాల్గొన్నారు. కావేరిగుంట గిరిజన కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఈక్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శన



**సైదాపురం, మార్చి 2, ప్రభాతవార్త** మండలంలో ఉన్న ప్రతి రైతు భరోసా కేంద్రాల నందు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించడం జరిగిందని వ్యవసాయాధికారి హైమావతి తెలిపారు. సైదాపురంలోని ఆర్‌బీకేలో రైతులతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని దీంతో సున్నా వడ్డీ పంట రుణాలు, మద్దతు ధర, వ్యవసాయ శాఖకు సంబంధించి పథకాలను లబ్దిపొందుతారని ఆమె తెలిపారు. ఈ క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శనపై ఏదైనా తప్పులు ఉన్నట్లయితే ఈనెల 5వ తేదీ లోపు స్థానిక వ్యవసాయశాఖ సహాయకులకు తెలియజేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొలిగర్ల శివకుమార్ యాదవ్, వ్యవసాయ సహాయకురాలు పుష్ప, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ ఉద్యోగి మృతి



**చేజర్ల మార్చి 2 ప్రభాతవార్త** చేజర్ల మండలం ఆదూరుపల్లి పెట్రోల్ బంకు వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమశిల ప్రాజక్టులోని కలువాయి 1 వ సబ్‌డివిజన్‌కు చెందిన వర్క్ ఇనస్పెక్టర్ నంది మండలం వెంకటరాజు మృతి చెందారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నుండి కలువాయికి ద్విచక్రవాహనంలో విధులకు వెళుతున్న వెంకటరాజు ఆదూరుపల్లి పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న సోమశిల నుండి నెల్లూరుకు వెళుతున్న బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇరిగేషన్ ఉద్యోగి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న చేజర్ల ఎస్ఐ ఎన్.ప్రభాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టరం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్లోబల్ స్కూల్‌లో ఆకట్టుకున్న గేమ్స్‌గాలా




**బుచ్చి మార్చి 2 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం గ్లోబల్ స్కూల్‌లో స్కూల్ కరస్పాండెంట్ షేక్.గౌసియా బేగం ఆధ్వర్యంలో గేమ్స్ గాలా నిర్వహించారు. క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. విద్యార్దులు వివిధ గేమ్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గౌసియా బేగం మాట్లాడుతు పిల్లలకు విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. విద్యార్దులు క్రీడలలో చురుకుగా పాల్గొంటే వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. ఈపోటీలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## సిద్దీపురంలో మూడిళ్లలో చోరి... క్లూస్‌టీం పరిశీలన



**సంగం మార్చి 2 ప్రభాతవార్త** సంగం మండలం సిద్దీపురం గ్రామంలో అర్ధరాత్రి మూడిళ్ళలో చోరి జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆయన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే క్లూస్‌టీం వేలిముద్రలు స్వీకరించారు. షేక్. మాబూజా షేక్. మస్తాన్‌సాహెబ్, శ్రీహరి, అనే వారి ఇండ్లలో 50 వేలు నగదు, ముక్కాలు సవరు బంగారు అపహరణకు గురైనట్లు బాధితులు వాపోయారు. తాము ఇండ్లలేని సమయంలో ఈచోరి జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే, బియంఆర్ అనుచరుడు తిరివీధి టిడిపిలో చేరిక



కావలి, మార్చి 2 ప్రభాతవార్త కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుల అంతరంగిక అనుచరుడు, వైసిపి పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షులు, మాజీ ఎయంసి డైరెక్టర్, గాంధీ విగ్రహ కమిటీ చైర్మన్, జాగరీ టామరిండ్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రముఖ వైశ్య నేత తిరివీధి ప్రసాద్ శనివారం చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరి సంచలనం సృష్టించారు. టిడిపి కావలి అసెంబ్లీ అభ్యర్ధి కావ్య కృష్ణారెడ్డి నాయకత్వంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఆయనకు చంద్రబాబు కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తిరివీధి ఉన్నపళంగా తెలుగుదేశం పార్టీలో చేరడంతో కావలి వ్యాపార, వైశ్య వర్గాలలో తీవ్ర చర్చనీయాంశమైంది. కావలిలో ఏ నోట విన్నా తిరివీధి టిడిపిలో చేరిన మాటే వినిపిస్తోంది. తిరివీధి మాట్లాడారు. కావలిలో టిడిపి అసెంబ్లీ అభ్యర్ధి కావ్య కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు గద్దెనెక్కడం ఖాయమన్నారు.

## కావలిలో వైసిపికి భారీ షాక్....పలువురు ప్రముఖులు టిడిపిలో చేరిక



కావలి, మార్చి 2 ప్రభాతవార్త కావలి అసెంబ్లీ టిడిపి అభ్యర్ధి కావ్య కృష్ణారెడ్డి ఎన్నికల బరిలో నిలబడటంతో కావలి ప్రాంతంలో పలువురు ప్రముఖులు వైసిపిని వీడి టిడిపిలో చేరడంతో ఆ పార్టీకి భారీ షాక్ తగిలిందని ప్రచారం సాగుతోంది. శనివారం కావలి పట్టణ 40వ వార్డు వైసిపి కన్వీనర్, జెండా చెట్టు అహలే సున్నత్ మసీద్ ప్రెసిడెంట్, ప్రముఖ ముస్లిం యువనేత షేక్ అబ్దుల్ అన్సర్, గౌరవరం మాజీ ఎంపిటిసి సురే జయశ్రీ, ఆమె భర్త సురే శ్రీనివాసులురెడ్డి, కావలి పట్టణ 26వ వార్డు వైసిపి నేత ఇస్కా విక్రమ్‌రెడ్డి తదితర ప్రముఖులు వైసిపిని వీడి కావ్య నాయకత్వంలో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వారందరికి చంద్రబాబు కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## వేమిరెడ్డి రాకతో టీడీపీ మరింత బలోపేతం



కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త : రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆ పార్టీ జిల్లాలో మరింత బలోపేతం అయిందని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం చంద్రబాబు సమక్షంలో వీపీఆర్ దంపతులు పార్టీలో చేరడాన్ని పురస్కరించుకుని కోవూరు నుంచి భారీ సంఖ్యలో ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లు, ఆటోలతో ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న 10 సీట్లను రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ ఆరు పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ సైకో పరిపాలన ఎప్పుడు అంతమవుతుందో అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గం సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## నారాయణలో అరుదైన థైరాయిడ్ శస్త్రచికిత్స



**నెల్లూరు మార్చి 2, ప్రభాతవార్త-వైద్యం** చాలాపెద్ద థైరాయిడ్ గడ్డతోపాటు కామెర్లు, తెల్లరక్త కణాలు తగ్గిపోయి తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ మహిళకు తమ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసి ఆరోగ్యశ్రీతో రూపాయి ఖర్చులేకుంగా ఆమె ప్రాణాన్ని కాపాడమని నారాయణ స్పెషాలిటీ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపాడు. శనివారం నగరంలోని ఆ ఆసుపత్రిలో జరిగిన విలేఖరుల సమావేశంలో దానికి సంబంధించిన వివరాలను వివరించారు. జనరల్‌హ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మహీధర్‌రెడ్డి, అసోసియేట్‌హ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటహరీష్‌లు మాట్లాడుతూ బద్వేలు పట్టాణానికి చెందిన రసూల్‌బీకి 7ఏళ్ళుగా థైరోటాక్సికోసిస్ అనే వ్యాధివల్ల గొంతు కింద పెద్దగడ్డ ఏర్పడిందన్నారు. ఆమె చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాల్లో వైద్యం చేయించుకుంటూ అనేకరకాల యాంటిబయాటిక్ మందులు వాడుతోందన్నారు. ఈ మందుల ప్రభావం వల్ల ఆమెకు కొన్నిరకాల దుష్ప్రభావాలు కలిగాయన్నారు. ఎక్కువ రక్తస్రావం, బీపీ హెచ్చుతగ్గులు లాంటి సమస్యలతో అత్యంత రిస్క్ తీసుకుని విజయవంతంగా 8గంటల పాటు రసూల్‌బీకి శస్త్రచికిత్స చేసి కాపాడామన్నారు. ఎండోక్రైనాలజీ డాక్టర్లు సునంద, కస్యప్, మత్తు డాక్టర్లు కృష్ణచైతన్య, రజిత తదితరుల బృందంతో కలిసికట్టుగా ఆమెకు శస్త్రచికిత్స చేశామని తెలిపారు. ఆరోగ్యశ్రీ లేనివారికి నారాయణ ఆరోగ్యమస్తు అనే పథకం ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తున్నామని చెప్పాడు. ఈ సమావేశంలో ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాపూరు మండలంలో 60 కేంద్రాలలో పోలియో చుక్కలు

**రాపూరు, మార్చి2 ప్రభాతవార్త** జాతియ పోలియో చుక్కల కార్యక్రమంలో బాగంగా ఆధివారం రాపూరు మండలంలోని 6 రూట్లలో 60పోలియో చుక్కల కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వేపినాపి ప్రాధమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రమీలా రాజకుమారి తెలిపారు. ఇందులో బాగంగా ఈ పోలియో కేంద్రాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అశాలు, ఆరోగ్య కార్యకర్తలు వుండి 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికిపోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మండలంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని 4వ తేది, 5వ తేదిఇంటింటికి వెల్లి పోలియో చుక్కలు వేయని చిన్నారులకు పోలయో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. అనంతరం పోలియో చుక్కలపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పలువురు వేపినాపి పిహెచ్‌సి పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది, విద్యార్ధులు వున్నారు.

## ధైర్యంగా పోరాడే వ్యక్తి నారాయణ



**నెల్లూరు రూరల్, మార్చి 2, ప్రభాతవార్త** నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ హాల్‌లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు టీడీపీలో చేరిక సందర్భంగా భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు విచ్చేశారు. చంద్రబాబుకు వీపీఆర్‌తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పొం గూరు నారాయణ టీడీపీ అగ్రనాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. సభావేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబుతో కలిసి నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పలు అంశాలపై మాట్లాడారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, నెల్లూరు నగర సిటీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్ధి డాక్టర్ పొంగూరు నారాయణ గురించి ఆయన ప్రస్తావించారు. మృదుస్వభావి అయిన నారాయణ లాంటి వ్యక్తిని వైసీపీ నాయకులు ఎన్ని ఇబ్బందులు పెడుతున్నారో మీరందరూ చూ స్తున్నారని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. కానీ నారాయణ కూడా అందుకు ధీటుగా ఒకటే ఆలోచించారని చెప్పారు. తాను ఏ తప్పు చేయను.. చేయబోనని.. తాను పోరాడుతూనే ఉం టానని ధైర్యంగా నిలబడిన వ్యక్తి నారాయణ అని కొనియాడారు. ఎవరేమి చేసుకున్నా ప్రజా సంక్షేమం, నెల్లూరు అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నారని ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి నారాయణను గెలిపించుకుని వారందరికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

## చేజర్ల డ్రాయింగ్ మాష్టర్‌కి జాతీయ స్దాయిలో సన్మానం



**చేజర్ల మార్చి 2 ప్రభాతవార్త చేజర్ల** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తోట కిషోర్ కుమార్‌కు శనివారం విజయవాడలో జాతీయస్దాయి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడలోని డ్రీమ్స్ వర్క్ హార్ట్‌గ్యాలరీ వారు నిర్వహించిన జాతీయ స్దాయి చిత్ర కళాప్రదర్శనలో తన అబ్బుతమైన ప్రతిభ చూపించారు. దీంతోగోల్డ్‌మెడల్ ,సన్మానం అందుకున్నారు. జాతీయస్దాయిలో మన తెలుగువాడు సన్మానం అందుకోవడం మన తెలుగుజాతి గర్వంచ దగ్గ విషయమని పలువురు ఉపాద్యాయులు అభినందించారు. గత సంవత్సరం కూడా జాతీయ స్దాయిలో బెస్టు క్రీయెటవ్ కళాకారుడుగా అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది కూడా జాతీయ స్దాయిలో అవార్డు అందుకోవడం కుటుంబసభ్యులు, పలువురు అభినందనలు తెలిపారు.

## వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి కేతిరెడ్డి రాజీనామా, టిడిపిలో చేరిక



**కావలి, మార్చి 2 ప్రభాతవార్త** కావలి పట్టణ రైతు నాయకుడు, పెద్దచెరువు సంఘం మాజీ అధ్యక్షులు కేతిరెడ్డి రామకోటారెడ్డి కుమారుడు, లత హాలు యజమాని కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. శనివారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. కావలి పట్టణ రైస్ మిల్ అధినేత, లత హాలు యజమాని శశిధర్‌రెడ్డి వేమిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఆయన వైసిపికి రాజీనామా చేయడంతో కావలిలో చర్చకు తావిచ్చినట్లయింది.

## కోనలో వైభవంగా శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

పెంచలకోన(రాపూరు), మార్చి 2ప్రభాతవార్త ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నృసింహ స్వామి వారి కళ్యాణోత్సవం శనివారంపెంచలకోనలోని స్వామి వారి ఆస్ధానమండపంలో వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామునస్వామి వారి మూలమూర్తికి అభిషేకం, పూలాంగి సేవ, గోపూజ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారి ఆస్ధాన మండపంలో స్వామి వారిని ఉభయ దేవేరులతో కలసి శోబాయమానంగా ఆలంకరింప చేసిన తదుపరి వేదపండితులు వేదమంత్రోచ్ఛరణల మద్య స్వామి అమ్మవార్ల కళ్యాణం శాస్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణమండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి, అమ్మవార్లకళ్యాణోత్సవాన్ని తిలకించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన వసతి ఏర్పాట్లను ఆలయ డిప్యూటీకమీషనర్ విజయ సాగర్ బాబు,,ఇతర సిబ్బంది పర్యవేక్షించగా, స్వామి వారి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి తదితరులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు.

## రేపటి నుండి మూడు రోజులు రాపూరులో గడప గడపకు నేదురుమల్లి

**రాపూరు, మార్చి2ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరులో ఈ నెల 4వ తేది సోమవారం నుండి బుదవారం వరకు గడప గడపకు తిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు, రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పర్యటన వుంటుందని వైసిపి నాయకులు అంటున్నారు. ఇందుకు సంబందించి శనివారం వైసిపి రాష్ట రైతు కార్యదర్శి బత్తిన పట్టాభి రామి రెడ్డి నివాసంలో ఈ కార్యక్రమానికి సంబందించినేదురుమల్లి మేనమామ మేడా సునీల్ కుమార్ రెడ్డి, మండల వైసిపి కన్వినర్ పాపకన్ను మధుసూధన్ రెడ్డి రాపూరు పట్టణానికి చెందిన పలువురు వైసిపి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటుపట్టణంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రతి గడపలో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందని, ఈ పర్యటనలో ఆయా ప్రాంతాలలో వున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా వైసిపి మైనారిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాధర్ భాషా, నాయకులు ఏటూరు మురళీమోహన్ రెడ్డి, గుండు రాఘవయ్య, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, మాదమాల పిచ్చి రెడ్డి, వి. గురవయ్య, పి. సుభాష్, టి. హారగోపాల్, మస్తాన్, బాబు తదితరులున్నారు.

## వేమిరెడ్డికి మద్దతుగా తెదేపా తీర్థం



**వింజమూరు, మార్చి2, ప్రభాతవార్త :** ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం నెల్లూరులో జరిగిన తెలుగుదేశం సభలో చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకుంటున్న సందర్భంలో వింజమూరు మండలం రావిపాడు గ్రామానికి చెందిన వైసిపి యువనాయకుడు కొండపల్లి సురేష్ తన అనుచర వర్గం మోతుకూరి రామారావ్, అనిల్‌కుమార్, హరికృష్ణ మరికొందరితో వేమిరెడ్డికి మద్దతుగా చంద్రబాబు సమక్షంలో చంద్రబాబుతో తెలుగుదేశం కండువాను నెల్లూరులో కప్పుకొని టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో వేమిరెడ్డి తో నడవడమే శ్రేయస్కరమని నేతలు పేర్కొన్నారు. రావిపాడులో విపిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10సంవత్సరాల రక్షిత మంచినీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి కృషి చేసిన వేమిరెడ్డి వెంటనే నడుస్తామని, ఉదయగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కాకర్ల సురేష్‌కు తమ మద్ధతు ఉంటుందన్నారు.

## తెదేపా తీర్థం పుచ్చుకున్న ఎంపిపి



వింజమూరు, మార్చి2, ప్రభాతవార్త : రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డిలకు మద్ధతుగా వింజమూరు ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి ఆయన సతీమణి రూపకళ తో కలసి శని వా రం నెల్లూరులో విపిఆర్ కన్వెన్షన్ హాల్లో జరి గిన తెలుగుదేశంపార్టీ సమావేశంలో చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం తీర్థంపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ మృధు స్వభావి, స్నేహశీలి , రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరుతున్న నేపథ్యంలో వేమిరెడ్డికి మద్ధతుగా తాను కూడా తెలుగుదేశంపార్టీలో చేరానన్నారు. 2024 ఎన్నికల్లో వేమిరెడ్డి వెంటే తన పయనం ఉంటుందన్నారు. త్వరలోనే ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమంలో తనతోపాటు తన అనుచర వర్గంతో పెద్ద ఎత్తున తెదేపాలోకి చేరనున్నా మన్నారు.

## చంద్రబాబునాయుడు పర్యటన దృశ్యమాలిక

















